# సంసారంలో సరిగమలు



*పాద పతితస్య పత్యుః*

*పృష్టం పుత్రే సమారుహతి*

*దృఢ మన్యుదూనాయా*

*అపిహాసో గృహిణ్యానిష్క్రాంతః*

**భావం:** కాళ్ళమీద పడ్డ భర్త మీదకు కొడుకు ఎక్కడం చూసిన ఇల్లాలికి కోపం ఎక్కువగా ఉన్నప్పటికీ నవ్వు వచ్చింది.

భామా సత్యవంతులది అనుకూల దాంపత్యం. సత్యవంతుడికి రాజధానిలో కోశాగారంలో ఉద్యోగం. భామ నేర్పరితనమూ, అణకువా ఉన్న

ఇల్లాలు వారి ప్రేమఫలంగా కొడుకు జన్మించాడు. భార్యాభర్తలకి సరస సల్లాపాలతో, పిల్లవాడి ముద్దు మురిపాలతో సమయం హాయిగా గడిచిపోయేది.

ఒకసారిసత్యవంతుడికి స్వగ్రామం వెళ్ళి తల్లితండ్రులను కలవాల్సిన పని పడింది. పిల్లవానితో ప్రయాణం కష్టం కనుక భామ ఇంట్లోనే ఉండిపోవలసి వచ్చింది. వారంలో తప్పకుండా వస్తాననీ ఎట్టి పరిస్థితిలోనూ పది రోజులు దాటనివ్వననీ భామకు మాట ఇచ్చి సత్యవంతుడు ప్రయాణం కట్టాడు. అరణ్య మార్గంలో ప్రయాణీకుల సమూహంతో కలిసివెళ్ళాడు. భామకు ఒకర్తీ ఉండడం చాలా కష్టమైంది. వివాహం అయ్యాక ఆమె ఏనాడూ భర్తను వదిలి ఉండలేదు. ఏకాంతమామెకు భారమైంది.పిల్లవాడికి కూడా తండ్రి దగ్గర చాలా చనువు. వాడు కూడా తండ్రికై బెంగ పెట్టుకున్నాడు.

ప్రయాణం కష్టమైనా వెళ్ళి ఉండాల్సిందేమోనుకుంటూ భామ వారం రోజులూ గడిపింది. ఎనిమిదవ నాటి ఉదయం గుమ్మంలో నిలబడి ఎదురు చూడసాగింది. భర్తతో వెళ్ళిన ప్రయాణీకుల బృందం తిరిగి వచ్చింది. భర్త రాలేదు. పని ఉండి రాలేదేమోననుకుంది. పది దినాలయ్యాయి. భర్త రాలేదు. పదిహేను రోజుల తర్వాత సత్యవంతుడి స్వగ్రామం నుంచి సార్థవాహబృందమొచ్చింది. వారితోనూ భర్త రాలేదు. భామ లో భయం ప్రవేశించింది. భర్తకు అనారోగ్యం కలుగలేదు కదా. మార్గ మధ్యంలో బందిపోట్లు చంపలేదు కదా. ఏ క్రూరమృగమో ఆహారంగా స్వీకరించలేదు కదా. భామ మనస్సు పరిపరి విధాల పోయింది.

ఇరవై అయిదు రోజులయ్యాక సత్యవంతుడు ఇంటికి వచ్చాడు. తండ్రిని చూస్తూనే కుమారుడు 'నాన్నా' అంటూ తండ్రి కాళ్ళను పట్టుకున్నాడు. కొడుకుని ఎత్తుకుని లోపలకు వచ్చిన భర్తకు కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళిచ్చింది. స్నానానికి ఏర్పాట్లు చేసింది. భోజనం పెట్టింది. కానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

భార్యకు కోపం వచ్చిందని గ్రహించిన సత్యవంతుడు "భామా తప్పనిసరై ఎక్కువ రోజులు ఉండాల్సివచ్చింది.  మా అన్నయ్య, వదినా వస్తున్నామని కబురంపారు. వారికోసం ఉండాల్సి వచ్చింది." అన్నాడు.

భామ మాట్లాడేదు.

"క్షమించు భామా. ఇంకెప్పుడూ ఆలస్యం చెయ్యను."

భామ ముఖం తిప్పుకుంది. " ఈ ఒక్క తప్పు కాయి. అన్నయ్యా వదినా వస్తున్నారని అమ్మ ఆగమంది.

భామలో కోపం కట్టలు తెంచుకుంది. " అవును మీరూ మీరూ ఒక్కటి నేనే పరాయిదాన్ని. రాలేక పోయారు సరే. కనీసం రాలేకపోతున్నాను అంటూ కబురైనా పంపారా? ఎంత భయపడ్డానో ఎంత బెంగ పెట్టుకున్నానో మీకేమెరుక? మీ వాళ్ళతో హాయిగా ఉన్నారు"అంది.

"క్షమించు భామా. నువ్వేం చెప్తే అది చేస్తాను. ఇదిగో నీ కాళ్ళు పట్టుకుంటాను" అంటూ సత్యవంతుడామె కాళ్ళపై పడ్డాడు. భామ కాళ్ళు వెనక్కి తీసుకోబోయింది. ఈ లోగా కొడుకు వచ్చి తండ్రి నడ్డి మీద ఎక్కి " నాన్నా గుర్రం తిప్పు" అన్నాడు.

ఆ దృశ్యం చూసిన భామకు కోపం పోయి నవ్వు వచ్చింది. తల్లిదండ్రుల సుఖసంతోషాలకు పిల్లలు అడ్డు అని చాలామంది విసుక్కుంటారు. కానీ సంసారంలో సరిగమలు పలికించేది పిల్లలే.

******